ప్రాణాలు తీస్తున్న అతివేగం



ఐరన్‌లారీని ఢీకొన్న తుఫాన్ (ఫైల్)



ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొనడంతో దెబ్బ తిన్న లారీ

కానరాని నియంత్రికలు

- అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- వాహనదారుల్లో మారని తీరు

వాజేడు: మండలంలోని 163 నంబర్ జాతీయ రహదారిపై అతివేగం ప్రాణాలను తీస్తుంది. జాతీయ రహదారి కావడం దూర ప్రాంతాలకు వెళ్లే వాహనలు అతి వేగంగా వస్తున్న క్రమంలో పలు చోట్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. 2024 జనవరి నుంచి నవంబర్ వరకు వాజేడు మండలంలో పలు చోట్ల జరిగిన ప్రమాదాల్లో చాలా మంది తమ ప్రాణాలను కోల్పోయారు.

కానరాని నియంత్రికలు

ప్రమాదాలు చోటు చేసుకోకుండా మండలంలోని గ్రామాల సమీపంలో రహదారిపై అక్కడక్కడ నియంత్రికలను ఏర్పాటు చేయాలని స్థానికులు తెలుపుతున్నారు. పూసూరు వద్ద గోదావరి బ్రిడ్జి నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సరిహద్దు వరకు ఎక్కడ కూడా నియంత్రికలు కానరావడం లేదు. జాతీయ రహదారి నిర్మాణ సమయంలో కొన్ని గ్రామాల్లో అక్కడి స్థానిక ప్రజలు రహదారిపై తారుతో ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించుకున్నారు.



కారు ఢీకొనడంతో దెబ్బతిన్న ట్రాక్టర్

పోలీసులు తనిఖీలు చేస్తున్నా మారని తీరు

ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో పోలీసులు తనిఖీలను ముమ్మరంగా చేస్తున్నారు. ప్రమాదాల నివారణ కోసం అవగాహన కల్పిస్తు వేగంగా వెళ్తున్న వాహనదారులకు జరిమానాలను విధించిన సంఘటనలు ఉన్నాయి. బ్రీతింగ్ ఎనలైజర్‌తో తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తున్నారు. అయినప్పటికీ వాహనదారుల్లో మార్పు రావడం లేదు.

బారీకేడ్ల ఏర్పాటు

మండల పరిధిలోని జగన్నాథపురం వద్ద గతంలో కారు, ట్రాక్టర్ ఢీ కొన్న ఘటనతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఈ ప్రమాదం జరిగిన తీరు ప్రజలను భయ భ్రాంతులకు గురి చేసింది. దీంతో ప్రమాదాల నివారణ కోసం అక్కడ పోలీసులు 163 నంబర్ జాతీయ రహదారిపై బారీ కేడ్లను ఏర్పాటు చేశారు.

మండలంలో జాతీయ రహదారిపై గతేడాది జరిగిన ప్రమాదాలు

- మండల పరిధిలోని పాయ బాటలు గ్రామం వద్ద ఆగి ఉన్న ఐరన్ లోడ్ లారీని వెనుక నుంచి తుఫాన్ వాహనం గత సంవత్సరం ఫిబ్రవరి 21న ఢీ కొనడంతో ఇద్దరు అక్కడి కక్కడే మృతి చెందారు.
- మండల పరిధిలోని జగన్నాథపురం సమీపంలో జరిగిన జీపు ప్రమాదంలో గత సంవత్సరం మే 11న ఒకరు మృతి చెందారు.
- ఏటూరునాగారం సమీపంలో హైవే ట్రీట్ వద్ద జాతీయ రహదారిపై గత సంవత్సరం జూలై 14న ఆటోను లారీ డీ కొన్న ఘటనలో నలుగురు మృతి చెందారు.
- మండల పరిధిలోని మండపాక గ్రామ సమీపంలో రహదారిపై గత సంవత్సరం సెప్టెంబర్ 9న అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మండపాక గ్రామానికి చెందిన ఒకరు మృతి చెందాడు.
- మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో ఆంజనేయుడి ఆలయాన్ని గత సంవత్సరం జూలై 11న లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో రేకులతో వేసి ఉన్న ఆలయంతో పాటు ఆంజనేయుడి విగ్రహం ధ్వంసమైంది.

క్లుప్తంగా

సన్మానం



ములుగు రూరల్: మల్లంపల్లి మండలం కోసం ఉద్యమాలు చేపట్టిన మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజును మంత్రులు సీతక్క, సురేఖ శుక్రవారం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి మల్లంపల్లి ప్రజల ఆకాంక్షను నెరవేర్చారని అన్నారు. మల్లంపల్లి మండల సాధనలో ఎనలేని కృషి చేసిన మంత్రి సీతక్కకు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

కంప్యూటర్లు అందజేత



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు సీనాప్సిస్ వారి ఆర్థిక సాయంతో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ ద్వారా స్కూల్‌కు 10 కంప్యూటర్లను అందజేశారు. ఈ కంప్యూటర్లు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎమ్మెల్సీ అలుగబెల్లి నర్సిరెడ్డి, సంస్థ ప్రతినిధులు శుక్రవారం ప్రారంభించారు. అలాగే సంస్థ ఆధ్వర్యంలో 30 బెంచీలు, 20 సైకిళ్లు, ఆర్‌ఓప్లాంట్ అందజేశారు. కార్యక్రమంలో సీనాప్సిస్ సంస్థ ప్రతినిధి నరేందర్, ఎంఈఓ సత్యనారాయణ, సీఐ బండారి కుమార్, తహసీల్దార్ రాజయ్య పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

ఏటూరునాగారం: మండలంలోని రొయ్యూర్ వద్ద గుడుంబాను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. మండలంలోని రొయ్యూర్ వద్ద ప్రధాన రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన కావిరి అంజన్‌రావు బైక్ వెళ్తుండగా తనిఖీ చేయగా ప్లాస్టిక్ సంచిలో 20 లీటర్ల గుడుంబా ఉందన్నారు. దానిని స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చర్య తీసుకోవాలి

ములుగు రూరల్: విద్యాశాఖలో అవినీతి అధికారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాదు రాకేశ్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా విద్యాశాఖ కార్యాంలో ఏసీజీఈ, జిల్లా సైన్స్ అధికారిగా విధులు నిర్వహిస్తూ అవినీతికి పాల్పడుతున్న అప్పని జయదేవ్‌పై ఉన్నతాధికారులు విచారణ చేసి సస్పెండ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుగులోత్ రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను మోసం చేస్తున్న ప్రభుత్వం

ఎస్‌ఎస్‌తాడ్వాయి: పథకాల పేరుతో పేద ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీఆర్‌ఎస్ ఎన్నికల మండల సమన్వయ కమిటీ సభ్యులు జాజచంద్రం, రామసహాయం శ్రీనివాస్ రెడ్డి, కొమరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని లింగాల ఎంపీటీసీ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో బీఆర్‌ఎస్ స్థానిక ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా వెంకటయ్య, చింత రమేష్, బుచ్చి రాములు, విజయ్ కుమార్, లక్ష్మీనారాయణ, చంద్రయ్య, సాంబశివరావు ,పాయం జగన్, చేలి శివకుమార్ ,యాప సతీష్ ,నారాయణ, కాంతారావు, లింగాల జీపీ సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా సారయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న నాయకులు

ఇసుక రవాణా నిలిపివేయాలి

వెంకటాపురం(కె): రోడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు ఇసుక లారీలను నిలిపివేయాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గ్యాసం వాసు అన్నారు. ఈ మేరు శుక్రవారం మండల కేంద్రంలో రహదారిపై సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుక లారీలను రోడ్డు మరమ్మతులు అయ్యేవరకు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కుమ్మరి శ్రీను, చిట్టెం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కన్నాయిగూడెం: మండలంలో కొత్తగా పట్టాలు చేసుకున్న రైతులు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి రైతు భరోసా పథకం అమలవుతుందన్నారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, దరఖాస్తు ఫారంను తీసుకోని రైతు వేదికలో ఉన్న ఎంఈఓలకు దరఖాస్తు అందించాలని తెలిపారు.

ధాన్యం డబ్బుల చెల్లింపులో కోతలు

ఏటూరునాగారం: ఏటూరునాగారం మండలంలోని జీసీసీ, సహకారం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులు విక్రయించిన ధాన్యంను కోతలు విధిస్తున్నారని రైతులు వాపోతున్నారు.డబ్బులు తక్కువగా పడ్డాయని సంబంధిత సెంటర్ సూపర్‌వైజర్‌లను అడిగితే పొంతన లేని సమాధానం చెబుతున్నారని తెలుపుతున్నారు. దీనిపై జిల్లా అధికారులు విచారణ చేపట్టి సంబంధిత వరిధాన్యం కొనుగోలు కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల అకౌంట్లో లో ఒక్కొక్కరికీ రూ.5 వేల నుంచి రూ.20 వరకు అకౌంట్లలో తక్కువ పడుతుందని రైతు కొండ పవన్ తెలిపారు.

పరామర్శ

వాజేడు: మండలంలోని జంగాల పల్లికి చెందిన వాసం నాగలక్ష్మి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ శుక్రవారం పరామర్శించారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్, నాయకులు విశ్వనాథ ప్రసాద్ రాజు, ఆదినారాయణ, వాసు, జగం బాబు ఉన్నారు.

సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియ

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

వాజేడు: లబ్ధిదారుల లిస్టులో పేరు రాలేదని అధైర్య పడవద్దని ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. మండల పరిధిలోని మొరుమూరు గ్రామ పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన చివరి రోజు గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు వర్తిస్తాయన్నారు. లిస్టులో పేరు లేకుంటే గ్రామ సభ వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో దరఖాస్తులను ఇవ్వాలన్నారు. లేదా తహసీల్దార్ కార్యాలయంలో కూడా ఇవ్వవచ్చని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాస్, వెంకటాపురం(కె) సీఐ కుమార్, ఎస్సై రాజ్ కుమార్, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు తదితరులు ఉన్నారు.



వాజేడు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

వెంకటాపురం(కె)లో..

వెంకటాపురం(కె): అన్ని వర్గాల ప్రజలకు పథకాలు వస్తాయని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. శుక్రవారం వీరభద్రవరంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పథకాల అర్హులకు వచ్చేవిధంగా చూస్తామన్నారు. ఇదే క్రమంలో ఇల్లురాని కొంత మంది వ్యక్తులు ఆందోళనకు దిగారు.

ప్రభుత్వంపై నిందలు వేయడం తగదు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అప్సర్ పాషా

కన్నాయిగూడెం: సంక్షేమ పథకాల అమలులో ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై నిందలు వేయడం తగదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అప్సర్ పాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు సామాన్య ప్రజలను గందరగోళంలోకి నెట్టుతున్నాయని అన్నారు. బుట్టాయిగూడెం గ్రామసభలో జరిగిన ఘటనకు ప్రతిపక్ష పార్టీలే పరోక్షంగా కారణం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జీ జాడి రాంబాబు, తాటి రాజబాబు, అబ్బు రమేష్, సుమన్, సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్ సునార్కని సాంబశివరావు, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరేష్, రాంబాబు, నాగేష్, సునార్కని సురేందర్, కుమార్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్సర్ పాషా

స్థానిక సంస్థల ఎన్నికల కోసమే గ్రామసభలు



ఏటూరునాగారం: మాట్లాడుతున్న సునీల్‌కుమార్



మంగపేట: మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

గోవిందరావుపేట: ప్రజలను మరోసారి మోసం చేయడానికి స్థానిక సంస్థల ఎన్నికల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ఒక్క పథకం కూడా అమలు చేయకుండా, చేస్తామని గారడి మాటలు చెప్పి రాబోవు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్లు దండుకోవడానికి సిద్ధమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ చల్వాయి గ్రామ కమిటీ అధ్యక్షుడు పూర్ణచందర్, ఈసం సమ్మయ్య, బూరెడ్డి మధు, బొల్లం ప్రసాద్, బైకాని ఓదేలు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ఏటూరునాగారం: మండలంలోని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభను ఉద్దేశించి విలేకరులతో మాట్లాడారు.వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మోస పూరితమైన జాబితాలను రూపొందించిందని ఆరోపించారు.

పార్టీలకు అతీతంగా పథకాలు ఇవ్వాలి

పార్టీలకు అతీతంగా పథకాలు అందించాలని బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఖాజాపాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభ అనంతరం ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిని విమర్శించే స్థాయి కాంగ్రెస్‌పార్టీకి లేదని ఆయన అన్నారు.

మంగపేట/కన్నాయిగూడెం: మాయమాటలు చెప్పి గొడవలు సృష్టించే మనస్తత్వం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబుది కాదని ఏమి తెలియకుండా కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదని మంగపేట, కన్నాయిగూడెం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, సుబ్బుల సమ్మయ్య అన్నారు. మండల కేంద్రంల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2010లో సీతక్క ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో కన్నాయిగూడెం గ్రామ సభలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన నాగయ్య భార్య శాంతకు అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగం ఇచ్చిమని చెప్పుకునే నాయకులు అప్పుడు ఏప్రభుత్వం అధికారంలో ఉందో సీతక్క అప్పుడు ఏపార్టీలో ఉందో తెలుసుకోవాలన్నారు. మంగపేట ఎఫ్‌ఎస్‌సీ చైర్మన్ తోట రమేశ్, రాజుయాదవ్, తాటి కృష్ణ, చిట్టిమళ్ల సమ్మయ్య, చిలకమర్రి రాజేందర్, తిరుపతి, చిన్నికృష్ణ, రాంబాబు, ప్రభాకర్, అశోక్, రాజుకుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

చివరిరోజు.. అదే హోరు



వెంకటాపురం(ఎం): అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు



బోరునర్సాపురంలో..



ఏటూరునాగారం: దరఖాస్తుల కౌంటర్ల వద్ద ప్రజలు



ములుగు: అధికారులతో మాట్లాడుతున్న స్థానికులు

- నిరసనలతో ముగిసిన గ్రామసభలు

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభ నిలదీతలు, నిరసనలతో ముగిసింది. డబ్బులు ఇచ్చిన వారికే ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు లబ్ధిదారుల జాబితాను తయారుచేసి గ్రామసభలో వినిపించారని ప్రజలు ఆరోపించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి దామోదర్ లబ్ధిదారుల పేర్లు వెల్లడిస్తుండగా స్థానిక యువకులు అడ్డుకొని ఇంటింటి సర్వే నిర్వహించిన పంచాయతీ అధికారులు ఒక్కొక్కరి నుంచి రూ.ఐదు నుంచి రూ.పది వేలు వసూలు చేసి లబ్ధిదారులుగా ఎంపిక చేశారని ఆరోపించారు. తాత, ముత్తాతల నుంచి గ్రామంలో పుట్టి పెరిగి ఇంటి పన్నులు కడుతున్న తమకు పథకాలు అందకుండా వలసవచ్చిన గొత్తికోయ కుటుంబాలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ గృహాలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. గ్రామ పంచాయితీ పరిధిలో 45 గొత్తికోయ కుటుంబాలు ఉంటే అందరిని ఎలా ఎంపిక చేశారని, అటవీ భూముల్లో ఉంటున్న గొత్తికోయలు ఇందిరమ్మ ఇళ్లకు ఎలా అర్హులవుతారని విమర్శించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు అధికారులను నిలదీశారు. జాబితా నుంచి గొత్తికోయల పేర్లను తొలగించాలని తీర్మానం చేస్తూ అధికారులకు తీర్మాన పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఎస్సై జక్కుల సతీష్, రెవెన్యూ ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఆందోళన చెందవద్దు

ములుగు: గ్రామసభలో చదివి వినిపించిన జాబితాలో పేరు రాలేదని ఆందోళన చెందకూడదని, తీసుకున్న దరాఖాస్తులను పరిగణలోకి తీసుకుంటామని మండల స్పెషల్ ఆఫీసర్ కొమురయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో సంక్షేమ పథకాలకు దరఖాస్తులు స్వీకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ రవీందర్ ఆధ్వర్యంలో సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వరావులు భద్రత చర్యలు చేపట్టారు. గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ విజయభాస్కర్, ఆర్ఐ యుగేందర్‌రెడ్డి, ఈఓ పెంట రఘు, ఏఈఓ జ్యోతి, టీఏ సాలయ్య పాల్గొన్నారు.

రసాభాసగా గ్రామసభ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా మారింది. ప్రజాపాలన గ్రామ సభలో భాగంగా గతంలో సర్వే చేసిన జాబితాను మండల ప్రత్యేక అధికారి రాంపతి చదివి వినిపించారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ ఇరు వర్గాలను చెదరగొట్టి అక్కడి నుంచి పంపించివేశారు. ఈ కార్యక్రమం ఏఎస్పీ శివం ఉపాధ్యయ, తహసీల్దార్ జగదీష్, ఆర్ఐ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ రాజ్యలక్ష్మీ, ఈజీఎస్ ఏపీఓ చరణ్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: గోవిందరావుపేట, చల్వాయి, రాఘవపట్నం, మచ్చాపూర్ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. చల్వాయి లో కొంత మంది తమ పేర్లు లిస్టులో లేవంటూ కాసేపు ఆందోళన చేయగా ఎంపీడీఓ జవహర్‌రెడ్డి మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పథకాలు అందేలా చూస్తానని నచ్చజెప్పడంతో గొడవ సద్దుమనిగింది.



వెంకటాపురం(ఎం): గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



వెంకటాపురం(ఎం): దరఖాస్తు ఫాంను చింపి నిరసన వ్యక్తం చేస్తున్న కుమార్



కోమటిపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్



గోవిందరావుపేటలో..

మంగపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గ్రామసభలు ముగిశాయి. మండలంలోని బోరునర్సాపురం, కోమటిపల్లి, మల్లూరు, కొత్తమల్లూరు, చెరుపల్లి, వాడగూడెం నిర్వహించిన చివరి రోజు గ్రామ సభలు రసాభాసగా సాగాయి. లబ్ధిదారుల జాబితాలో అర్హులైన వారి పేర్లు రాలేదని అనర్హులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వారి బంధువుల పేర్లు రావడంతో మహిళలు, గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలోఎంపీడీఓ భద్రు, తహసీల్దార్ రవీందర్, ఆలేటి సుదర్శన్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్ రావు ఏఓ చేరాలు, ఎంపీఓ మమత, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి సుదర్శన్, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఈజిఎస్ ఏపీఓ అంకూస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలకు అనుమతి ఇవ్వాలి

ఏటూరునాగారం: గోదావరి పరివాహక ప్రాంతాల్లో నది వల్ల వేలాది ఎకరాలు ఇసుక మేటలు వేశాయని, దానికి రైతు భరోసా ఇవ్వాలని, లేదా ఇసుక తీసుకునేందుకు అనుమతి ఇప్పించాలని రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, గుడ్ల దేవేందర్, వావిలాల ఎల్లయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని ఇసుక భూములకు సాగులో లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, ఎకో సెన్సిటివ్ జోన్ వల్ల ఇసుక తవ్వకాలు జరుపలేకపోతున్నామన్నారు. దీనివల్ల ఇటు రైతు భరోసా రాక, అటూ ఇసుక తీయలేక రెండు విధాలుగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో కిరణ్, తిరుపతి, రాంబాబు, నరేందర్, గౌస్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలి

- రైతు సంఘం జిల్లా కన్వీనర్ అమ్జద్‌పాషా

ములుగు రూరల్: ప్రభుత్వం సన్నధాన్యానికి ప్రకటించిన బోనస్ డబ్బులను రైతుల ఖాతాలలో వెంటనే జమ చేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కన్వీనర్ అమ్జద్‌పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా సివిల్ సప్లై అధికారి ఫైజల్ హుస్సేన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మకాలు చేపట్టి నెలలు గడుస్తున్న సన్నధాన్యానికి బోనస్ డబ్బులు జమ కాలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్, వాంకుడోత్ సమ్మయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న అమ్జద్‌పాషా

ఒకరికి గాయాలు

వెంకటాపురం(కె): రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన వెంకటేశ్వర్‌రావు ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎదురుగా మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వర్‌రావు కాలు విరుగగా ఆస్పత్రికి తరలించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ములుగు : 9705748198

Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188

పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944